కథానిక :

పొగచూరిన గోడలు

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

ఒకబండీ, రెండెడ్లూ ఒకచిన్న మడిచెక్కా, తాటిపెండె—ఇదీ తన ఆస్తి. దీని సిగ తరగా, వొంటికి ఏభైఏళ్లొచ్చాక యీ మాత్రం చేసుకోవడానికి యింటిల్లపాదీ రెక్కలు విరుచుకోవలసివచ్చింది. ఛీ ఎదవబతుకు! అనుకున్నాడు అప్పన్న. అయితే యీ వూరిలో యీ మాత్రం ఎవడికుంది, అని సంతృప్తిపడ్డాడు మళ్లీ.

బాగా రాత్రయిందేమో చీకటి దట్టంగా కాటుకలా వుంది. అయితేనేం, తన వూరు పొలిమేరకు వచ్చేశాడు అప్పన్న. ఈ ప్రదేశంతో తనకు ఏభైఏళ్ల పరిచయముంది. ఇంక తను కళ్లు మూసుకుని యింటికి చేరుకోగలడు. చెరువుగట్టుమీద, పురుగూ బుట్రా కాళ్లలో పడకుండా చేతిలోని మువ్వకట్టిన చేపాటి కర్ర చప్పుడు చేసుకుంటూ నడుస్తున్నాడు అప్పన్న. అంతా అతి నిశ్శబ్దంగా వుంది. కనుమాపు మేర దూరంలో, తన వూరిలో వొకటి రెండు దీపాలు వొకటి రెండు చిన్న చిన్న చలిమంటలు మసకమసగ్గా కనిపిస్తున్నాయి. ముసలితనంలో కొంచెం రేచీకటుంది అప్పన్నకి. అయినా అది తన పనుల కేమీ అడ్డురాలేదు యింతవరకూ. చెరువుగట్టుమీద వో నిముషం నిలబడి తలెత్తి వూరువేపు చూశాడు. చీకటిలో దృష్టికేదీ సమంగా ఆనలేదు. ఇదేమిటీ వూరు అప్పుడే నిద్రపోతూందేమిటి అనుకున్నాడు. ఈవూరు తన తల్లితండ్రులు, తాతముత్తాతలు, తను పుట్టిపెరిగిన వూరు. కాని యిప్పుడు యీ వూరంటే అసహ్యమేస్తూంది; వొళ్లు మండుతూంది. ఊళ్ళో ఎవళ్లకీ తాగడానికి గంజినీళ్లు లేవు. కాని బుర్రతిరుగుడు చూస్తే ఎక్కువ. మంచీ, మర్యాదా, న్యాయం, ధర్మం అనేవి ఎవరిదగ్గరా లేవు; ఎవడికీ బతకడం చాతకాదు; ఎవడైనా బతుకుతూంటే చూడలేరు. ఎవడూ మంచిగా వుండడు; ఎవడైనా మంచిగా వుంటే వుండనివ్వరు. తను కొత్తగా బండీ, ఎడ్లూ, కొన్నాడు. ఊళ్లో ఎవడికీ యిటువంటి ఎడ్లుగాని, బండిగాని లేవు. ఊరంతా కలిసి ఓ వందకొంపలున్నా పట్టుమని నాలుగుజత లెడ్లు లేవు. అవికూడా రేపో ఎల్లుండో చచ్చేటట్లుంటాయి. అంచేత యీవూరివాళ్లందరికీ కడుపుమంట. ఛీ! అనుకుంటూ నడుస్తున్నాడు.

ఊళ్ళో అందరూ అసలే దరిద్రులు. దానికితోడు చాలమంది సోమరిపోతులు. డబ్బంటే అందరికీ ఆశే. కాని ఎవడికీ ఆర్జించడం చాతకాదు. ఒకపూటకి గంజినీళ్లు దొరికితే రెండుపూటలు పని చెయ్యరు. కాని ఎవడైనా కష్టపడి సంపాదించుకుంటే మాత్రం చూడలేరు. అందరికీ దేవుడంటే పరమభక్తి, అతిభయం. కాని అంతా పాపాలు చేస్తూనే వుంటారు. చిత్రం!

తనంటే వాళ్ళకి ఈర్ష్య. తనకిమాత్రం ఏముంది? తన తండ్రి తనకాయిల్లూ, యీ చేపాటి కర్రా వదిలిపెట్టాడు. తన కష్టార్జితంగా ఎడ్లూ ఓమడిచెక్క సంపాదించేడు. ఈమధ్య బండీ ఎడ్లూ కొన్నాడు. అయితే తను కష్టపడి పనిచేస్తాడు. తన పెళ్ళాం పొలంలో పనిచేస్తుంది. కూతురు వీధిలో బండరాయిమీద చిన్న దుకాణం పెట్టి ఎండుచేపలూ, గోంగూర, మిరపకాయలు, వుల్లిపాయలు అమ్ముతుంది. పేడతెచ్చి, పిడకలు పెట్టి బ్రాహ్మలకూ, కోమట్లకూ అమ్ముతుంది. కొడుకు చిన్నవాడైనా మంచి ప్రయోజకుడు. ఇలా యింటిల్లపాదీ కష్టపడి నాలుగు రాళ్ళు చేసుకుంటే వూరిబాబుగారి సొమ్మేదో పడేసుకున్నట్టు యీ వూరివాళ్ల కెందుకు కడుపుమంట?

తను బండీ, ఎడ్లూ కొన్నాక తన జాగాలోనే తన యింటిపక్కన సాల వేసుకుందామని, బ్రాహ్మలింటికెళ్లి మంచిరోజు కనుక్కొని, నేరడరాట తెచ్చిపాతేడు. ఊరువాళ్లందరికీ మహా కడుపుమంటగా వుంది. వీడు సాల ఎలా వేస్తాడో చూడమా అంటూ నలుగురూ చేరేరు. సాలవెయ్యడానికి వీలులేదన్నారు. అది తన జాగా అన్నవిషయం లోకమందరికీ తెలు

సన్నాడు తను. వాళ్లు కాదన్నారు. అయితే మరి ఎవరిది ? ఏ వొక్కడికీ ఆ జాగా తనదని చెప్పడానికి గుండె ల్లేకపోయాయి. అందులో వో తెలివైనవాడు, ఆ జాగా ఎవరిదీ కాదు అమ్మవారి దన్నాడు. ఇంకేం, మంచి సాకు దొరికింది. ఆ జాగాకి కొంత దూరంలో వొక రాయి వుంది. దానికి పూజా పునస్కారం జరుగుతుంది. కాని యీ జాగా మాత్రం తనదే నన్నాడు. కావేషీలు, పెరిగాయి ; దొమ్మ లాట జరిగింది. కోర్టు కెక్కుతానన్నాడు కాని కేసు పోతుందని తెలిసి వాళ్లు వూరుకున్నారు. కాని అప్పటినుండీ వాళ్లకి మరీ కడుపుమంటగా వుంది ; కావేషీలు బాగా పెరిగిపోయాయి.

వాళ్లకి మనసులో కోపముంటే నాదగ్గర కొచ్చి చూపించరాదా? నోరు లేని జంతువు అదేం చేసింది ? అనుకున్నాడు అప్పన్న. సలసల కాగిన గంజి తెచ్చి తన ఎద్దుమీద పోశారు ; అరిచెయ్యి మేర చర్మం, కాలిపోయింది. ఎంత బాధ పడుతూందో ? అరవదు, లేవదు, గడ్డి తినదు, కుడితి తాగదు. పాపం నోరు లేని జంతువు అదేం తప్పుచేసింది ? అనుకుంటూ మెల్లిగా నడుస్తున్నాడు.

పొన్నూరు మంగలాడికి పశువులవైద్యం తెలుసునంటే అక్కడికి పరిగెట్టేడు అప్పన్న. వాడు పావలా పుచ్చుకుని నూనెలో మందు కలిపిచ్చాడు. ఈ నూనె రాసి జిల్లేడాకేసి కట్టమన్నాడు. రెండు రోజులకల్లా పుండు నల్లగా మాడిపోతుంది చూసుకోమన్నాడు. చేతిలో పట్టుకున్న కొబ్బరిచిప్పలో నూనె వుందో వొలికిపోయిందో అని వేలు పెట్టి చూసేడు అప్పన్న.

కొంచెం దూరాన్న మామిడిచెట్లమధ్య నల్లమారమ్మగుడి తెల్లగా కనిపిస్తూంది. లోపల చిన్న దీపం కూడా వెలుగుతూన్నట్టుంది. గుడివేపు తిరిగి, చేతిలో చిప్ప నేలపెట్టి దండం పెట్టుకున్నాడు. "తల్లీ, నల్లమారమ్మ, రచ్చించు తల్లీ; ఎద్దు నేచి తిరుగుతే నీకు కోడిపిల్ల నిచ్చుకుంటాను తల్లీ" అని మొక్కుకుని మళ్లీ నడక మొదలెట్టాడు అప్పన్న. కాలి కేదో గట్టిగా తగిలింది. "హై దీని సిగ్గొయ్య. ఏటది ? నాగలిదుక్క. అరి! ఈళ్లు నా దారి కడ్డంగా వొగ్గిశారేటి ?" అని తిట్టుకుంటూ కాలుతోటి దానిని చెరువులోకి తోసేశాడు. చెరువులో నీరు లేదులే తుమ్మచెక్క నానిపోవడానికి అనుకున్నాడు. తన వూరుకూడా యీ చెరువులాగే వుంది. పంటనూర్పులైన నాలుగు రోజులూ వూరు కలకలలాడినట్లే వర్షాలు పడిన నాలుగురోజులూ చెరువులో నీళ్లుంటాయి తరవాత కాలమంతా చెరువుగర్భంలో బారెడుమేల బురదనీళ్లు; ఊళ్ళో కొంచెం గంజి నీళ్లు,—అంతే. ఛీ! ఏం బతుకు! అనుకున్నాడు.

ఊరు దగ్గరపడింది. ఈ గట్టు దాటితే వూరు. చీకట్లో ఒక కాగడా, డోలక్కు భజనా తనవేపు వస్తున్నాయి. "నారాయణ, నారాయణ" అనుకుంటూ ఎవరో శవాన్ని మోసుకొస్తున్నారు. "ఇదేటి యింటికాడ కొస్తుంటే శవ మెదురుపడింది? సీతారాం, సీతారాం" అనుకున్నాడు అప్పన్న. బూరుగు చెట్టుకింద కొచ్చేసరికి భజన దగ్గరపడింది. మాలాళ్లు భజన చేస్తున్నారు. ఆ వూరికి భజనపార్టీ అదొక్కటే. ఎవరు చచ్చినా యీ మాల చిన్నిగాడి భజనపార్టీని పిలుచుకు పోతారు.

"ఎవరురా సిన్నిగా" అన్నాడు అప్పన్న.

"గొల్ల రామయ్య కొడుకు"

"అలాగా" అన్నాడు అప్పన్న పరధ్యాన్నంగా.

"రెండు మేకలున్నాయి గదా, నాలుగు రెమ్మలిరుద్దామని బాపనోళ్ల రావిసెట్టెక్కినాడు. నాగుపాము కుట్టేసింది."

"రామ, రామ"

"అక్కడ నాగుపాముందని అందరికీ తెలుసు, ఆడికీ తెలుసు. కాని ఆడి కరమం కాకపోతే ఆ మారాజు జోలి కెందుకెళ్ళాలిడు, సెప్పు? మంత్రాలు తంత్రాలు ఏయించినారు. కాని ఏటి నాబం ?" అని చెప్పుకెళ్లిపోతున్నాడు సిన్నిగాడు. అప్పన్నకిదంతా వినాలని తుతూహలం లేదు. "పోనీ నేరా, ఎందుకా సొద, ఆడి కాయురుదాయం సెల్లింది. ఎవ డేటి సెయ్యగలడు. కాని సిన్నిగా, మాయింటివైపుగాని ఎల్లినావేట్రా, ఎద్దు కెలాగుందో ఏమైనా తెలుసా" అన్నాడు అప్పన్న ఆతృతగా.

"నీ ఎద్దు కేట్రా. మారాజునా గుంది. చాకలి సత్తిగాడు దిష్టి తీసి జిల్లెడాకు కట్టమన్నాడట. నీ కోడలు కొడవలి కాల్చి, అగ్గి తీసి, బుగ్గితీసి దిష్టితీసి పెంటమీద వొడేసింది. జిల్లుడాకు లేరి. ఆవడంలో

ముంచి కట్టేసింది. ఎద్దు మారాజులా నెగిచి తిరుగుతూంది," అని చెరచెర నడిచివెళ్లేడు సిన్నిగాడు. తన్ను వదిలిపెట్టి భజనపార్టీ వెళిపోతూంది. పరుగెత్తి వెళ్లి కలుసుకొన్నాడు. "గూటిలోని రావసిలకా గూడు దాటీ పోయెరా..." అని పాడుకుంటూ భజన పార్టీ సాగిపోయింది. "అమ్మయ్య, బతికింది ఎద్దు. ఇంతకీ తన పెళ్లాం తెలివైంది," అనుకుంటూ తాటి పెండెలోంచి నడిచేడు అప్పన్న. ఇల్లు దగ్గరపడింది. ఇంకేముంది ఈ తాటిపెండె దాటితే తన యిల్లు.

"అమ్మయ్య, ఎద్దు బతికింది. తల్లి మాలచ్మి, నల్లమారమ్మ రచ్చిత్తే యీ పూరోళ్ళేటి సెయ్యగలరు" అని మళ్లీ ఆలోచనలో పడ్డాడు. ఎద్దు చస్తే నూరు రూపాయలు నష్టం. కానీ పరకా, గనుకనా—ఇంతకీ తన పెళ్లాం పిల్లలూ అదృష్టవంతులు. ఈ బండి కాని సంతలకి తోలితే వొకేసారికి అయిదారురూపాయలు దొరుకుతాయి. పట్టుమని నాలుగునెలలు తోలితే నూరురూపాయలు చెయ్యవచ్చును. కూతురికి భజంత్రీ మేళం, గేసులైటూ పెట్టి పెళ్లి చెయ్యొచ్చును. పట్నం సంబంధమే చెయ్యాలి. పట్నం పోతే నాలుగు మెతుకులు తింటుంది. ఛీ. వూళ్ళో సంబంధంమాత్రం చస్తే చెయ్యకూడదు. గంజికి లేని దరిద్రులు.

గొల్లుమని గోల వినిపిస్తూంది. పరధ్యాన్నంనుండి వొక్కసారి మేలుకొని తలెత్తి చూసేడు. ఇంకేముంది ఊరు అంటుకుంది. మంటలు ఎర్రగా ఆకాశానికి ఎగురుతున్నాయి. "ఓరి బాబోయ్, సాలలో ఎద్లుండిపోనాయ్ బాబో, యిప్పినారో లేదో..." అని అరుచుకుంటూ పరిగెత్తేడు అప్పన్న.

ఊరంతా అల్లకల్లోలంగా వుంది. మంచాలూ, చింకిపాతలూ అవీ దారికడ్డంగా పారేశారు. ఆడాళ్లూ పిల్లలూ అటూ యిటూ పరుగెడుతున్నారు. ఏడుపులు మొర్రలు, తిట్లు, శాపాలు.

అప్పన్న పరిగెత్తుకుంటూ ఇంటిదగ్గర కొచ్చేడు.

"ఎద్లు, ఎద్లు, నచ్చి" అని కేకేశాడు. లచ్చి ఏడుస్తూ, తిట్టుకుంటూ వచ్చి "ఇప్పేసి బాపనోళ్ల దొడ్లో వొగ్గేసినాను మామా" అంది. అప్పన్న మనసు కొంచెం కుదుటబడింది. తన సాల కాలిపోయింది.

బండి కాలుతోంది. దగ్గరి కెవ రెళ్లగలరు? ఎవ రార్పగలరు?

"మన సాలకి జాతిసచ్చినో డెవడో అగ్గెట్టేసినాడు" అంది లచ్చి తిట్టుకుంటూ. పల్లెటూర్లో ఇంటికి నిప్పుపెట్టడం అతి తేలిక, అతి సాధారణం. "సూడలేని రెుదవ మన సాలొక్కటే కాలి వూరుకుంటుందనుకున్నాడేటి" అని, వేపచెట్టు కిందకొచ్చి రాతిబండమీద కొచ్చి చతికిలబడ్డాడు. అప్పన్నకి మతిపోయింది. అతడి కేమీ అర్థం కావడం లేదు.

మంటలు పూర్తిగా ఆరిపోయాయి. ఊళ్లో అల్లరి సద్దుకుంది. "ఊర్లో సగం కొంప కాలిపోనాది, మామా" అంటూ లచ్చి దగ్గరగా వచ్చి అప్పన్న వొంటిమీద చెయ్యివేసింది. అప్పన్న వొక్కసారి కళ్లెత్తి లచ్చివేపు చూసేడు.

"ఎలాగున్నావ్"

"బండి కాలిపోయింది. మళ్లీ బండి సేయించాలంటే ఎనబైరూపాయిలవుతాది, ఎక్కడ తెచ్చేది సెప్పు?"

"సరి నే, మన మేటి సెయ్యగలం. నెగు, మంచమేత్తాను తొంగుందువుగాని..." అన్నాది లచ్చి.

"ఆళ్లు బతక నేరు, యింకొరిని బతకనివ్వరు. ఎదవ జలమ. మనిసిజలమ ఎత్తగానే సరా." అంటూ లేచి, చెవిలోంచి చుట్టపీక తీసి ఎలిగించి, చెట్టుకింద మంచంమీద నడుంవాల్చి పడుకున్నాడు అప్పన్న.

చీకట్లో ఆకాశంమీది చుక్కలు మిలమిల మెరుస్తున్నాయి. వేపచెట్టుమీది గబ్బిలాలు రెక్కలు చప్పుడు చేస్తున్నాయి. అప్పన్నకి నిద్ర పట్టడం లేదు. ఇలా తనీ వూళ్ళో ఎంతకాలం బతగ్గలడు? ఊరంతా విరోధులే. తనెవ్వరికీ వుపకారం చెయ్యని మాట నిజమే. కాని తను ఎవ్వరికీ అపకారం కూడా చెయ్యలేదు. తను ఎవడికడుపూ కొట్టి అన్యాయంగా డబ్బు సంపాదించలేదు. తను రెక్కలు విరుచుకుని, చెమటోడ్చి నాలుగురాళ్ళు చేసుకున్నాడు. అయితే మరి వాళ్ల ఈర్ష్యకు కారణమేమిటి? దారిద్ర్యం, మూర్ఖత్వం, అజ్ఞానం, అవినీతి వ్యాపించివున్న యీ వూళ్ళో కానీ లాభ ముందంటే ఎటువంటి పాపాలు చెయ్యడానికైనా వెనుదియ్యరు. అయితే తన్ను బాధించడంవలన వాళ్లకేమిటి లాభం? ఏమీ లేదు.

కాని నీతి అన్నది పూర్తిగా చెడిపోయినతరువాత పచ్చగావున్న వాడిని చూడలేక పోవడమే నీతి

అయింది. అయితే వీళ్లతో విరోధంగా యీవూళ్ళో యింక బతకడం కష్టం. వాళ్లతో రాజీ చేసుకోవాలి, అని ఆలోచిస్తూండగా ఎప్పుడో నిద్రపట్టింది అప్పన్నకి.

"సెగు, సెగు తెల్లారింది." అన్నాది లచ్చి.

అప్పన్న లేచి కళ్లు నులుపుకొని, చుట్ట వెలిగించి, కాలిపోయిన మొండిగోడలవేపు మాసేడు - అప్పుడే అంతా యిళ్లు తుడుచుకొని, యిళ్లల్లో సామాను సర్దుకుని వీధుల్లో తిరుగుతున్నారు. వెదురు బద్దలూ, తాటి కమ్మలూ, వున్నవారు వొక రిద్దరు, నేతకూడా మొదలు పెట్టేరు. ఎవరి మొహాల్లోనూ యిళ్లు కాలిపోయాయనే విచారం ఏమీ లేదు. అప్పన్న కెందుకో ఆశ్చర్యమేసింది—

"ఇళ్లు కాలిపోతే మారాజుల్లా తిరిగేస్తున్నారేటి ?" అన్నాడు అప్పన్న—

"నేకపోతే వురెట్టుకోమంటా వేటి ! మంచోడివే—" అంటూ లచ్చి మంచం ఎత్తి యింట్లోకి పట్టుకుపోయింది—అవును నిజమే, ఈ వెధవ వూరు ఏడాదికి రెండుసార్లయినా కాలుతుంది. రోజూ చచ్చేవాడి కెక్కడకని ఏడుస్తారు.

"నచ్చీ, ఇలా బతకనేమే యీవూళ్లో. ఎంత కాలమేటి యీ ఇరోదం." అన్నాడు అప్పన్న.

"ఏటి సేత్తారేటి ? జాతిసచ్చిన యెదవలు ! రానీ కళ్లాపు జల్లుతాను. తీసీరా నాయనా, నా దగ్గరీ యీసాలు—"

"నచ్చీ, నీకు గ్యానం లేదే. నువ్వే కయ్యానికి కాలు దువ్వినావు. మొదటి కాడినుంచీ, ఆడోళ్ల నందరినీ నోటికొచ్చినిట్టు తిట్టినావు—ఆల్లని నానా మాట లాడినావు. తప్పు కాదా ?

ఆల్లతో యిరోదం ఏటి నాబం సెప్పు ?"

"అంటూ బోగపరిచాడు. లచ్చికి డబ్బుందన్న గర్వం లేకపోలేదు. తక్కినవాళ్లందరినీ తక్కువగా చూడడం, నానామాట లాడడం కూడావుంది.

"అయితే ఏటి సెయ్యమంటా వేటి ? ఆల్లకాళ్లొట్టుకోమంటా వేటి ?"

"అది కాదే ఎర్రిదానా, ఆల్లతోటి యిరోదం మానుకొని, కలిసి మెలిసి నడుసుకపోతే సరి. ఆల్లతో, యిరోదం పెట్టుకుని మనం బతకనేం. ఇయాలతో రాజీ అయిపోవాల—" అని లేచి నాలుగు చల్ది మెతుకులు తిని కరణంగారింటికి బయలుదేరేడు.

కరణంగారి యిల్లు పెంకుటిల్లు. ఇంటిముందు ఎత్తుటరుగు లున్నాయి. ఈ అరుగులకి పక్కనే వున్న వేపచెట్టు నీడనిస్తుంది. కరణంగారు అరుగుమీద ఠీవిగా కూర్చుని చుట్ట పొగ వదులుతున్నారు. చుట్టూ చాలమంది కూర్చున్నారు. ఇళ్ల నేతకి వెదురు బద్దలు, రాటలు, తాటికమ్మ— వీటిగురించి సలహాకొచ్చేరు—

"రామిగాడి తాటిపెండేకమ్మ సాలదు బాబు. తమరో నాలుగు రేకులు సాయం సేత్తే సాలు బాబయ్యా" అన్నాడు గొల్ల వెంకడు.

"ఇద్దును గాని, వోచిన్న చిక్కుందిరా. మా అన్నయగారి కుమార్తెకు వచ్చే శ్రావణంలో వివాహం. ఇక్కడే చేసుకుంటారట. మా వెనక సాలం ఆవుల సాల నేయించాలి. పెరట్లో దడి కట్టించాలి. పందిరి వేయించాలి. అంచేత యిప్పుడు వీలుపడదురా. లేకపోతే వెధవకమ్మరేకులు భాగ్యమా ఏమిటి ?" అన్నాడు కరణం.

ఒక సారిచ్చి అలవాటు చేస్తే ప్రతీసారీ అడుగుతారు - వెధవపూరు తెల్లారితే కాలుతూనే వుంటుంది అనుకున్నాడు కరణం. కమ్మరేకులు వాళ్లకి పెద్ద సమస్య అయింది. ఎలాగ ? ఊళ్లో ఎవడిదగ్గర వున్నాయి.

అప్పన్న మెల్లగా వచ్చి కరణానికి దండం పెట్టి కూర్చున్నాడు-

"ఏమోయ్ అప్పన్నా ఏమిలా వచ్చావ్" అని పలకరించాడు కరణం -

"ఏం నేదు బాబు. వూరు కాలిపోయింది గదా" అన్నాడు అప్పన్న.

"అయితే నీకేటి నేరా. ఏం లేనోడివా ? యీసారి అప్పన్న పెంకుటిల్లేయిస్తాడు బాబూ" అన్నాడు గొల్ల వెంకడు - గొల్ల వెంకడు ఎండిపోయిన ములంచెట్టులా వుంటాడు. గోచీ తప్ప రెండోబట్ట కట్టి ఎరుగడు.

అప్పన్నకీ విసురు అర్థమయింది. కాని తను దెబ్బలాటకి రాలేదు. ఎలాగైనా రాజీ చేసుకుందామనే సంకల్పంతో వచ్చాడు.

"కమ్మరేకులుగురించి మాటాడుతున్నామోయ్. నీకు తాటిపెండె వుంది కదూ." అన్నాడు కరణం.

"నేకేం బాబూ-అయితే వో సిన్నమనవి బాబు, యినండి. తోలీత మా యిల్లంటుకుంది. ఎలా గంటుకుందో ఆ పాపం పున్నెం బగమంతుడి కెరిక. పోతే పోనీ, ఊరంతా కాలిపోనాది కదా. ఎవరేటి సెయ్యగలం. కాని బాబయ్యా ఈ ఇకోదాలు ఎంతకాలం బాబయ్యా. ఒకూర్లో వున్న తరువాత కట్టమొచ్చినా సుకమొచ్చినా వొకడి కొకడు కాకపోతే ఏనాగు! బాబు ఈళ్లతో నాకు యిరోదం నేదు; నే నెవడికీ అపకారం సెయ్యనేదు బాబయ్యా. నాసేత నయితే సాయం సేయడానికికూడా తయారుగున్నాను. ఈ ఏలతో అంతా సరుదుకుపోవాల," అన్నాడు అప్పన్న.

"బయలుదేరినాడు బాబు కొవందు - అందరినీ ఆదుకుంటా డిక-" అన్నాడు రాముసాయుడు. రాము నాయుడి శరీరమంతటికీ మీసాలే బలంగా కనిపిస్తాయి. గొప్పతనంలో డబ్బంతా కర్చయిపోయినా మీసాలుమాత్రం చెక్కు చెదరకుండా మిగిలాయి. అప్పన్న యీ మాటలను లక్ష్యపెట్టక మళ్లీ అందుకున్నాడు. "బాబో నాకు తాటిపెం డుంది. కమ్మరేకులు వొత్తుగున్నాయి. నాయింటికీ, సాలకీ కాక మరో రెండిళ్లకి సరిపోయే రేకులున్నాయి. కట్టమనేది అందరికీ వొత్తాది. ఒకడి నొకడు ఆదుకోకపోతే ఎనాగ? కావలసి నోడొచ్చి నాలుగు రేకులు కొట్టుకోమను బాబు - నే వొద్దన్నా నేటి - అవుసరం అందరికీ వొత్తాది. అంతేకాదు బాబయ్యా-నా బండి కాలిపోనాది - నా గొడ్లకి పని నేదు - ఏరువూత కాలం గదా - ఊర్లో అందరం వూసుకోవచ్చునాటిని - ఏటి బాబు - ఏటుండి పోతాది? పోయే నప్పుడ్ కట్టికెల్లి పోతా మేమిటి బాబయ్యా- సెప్పండి బాబు తెలిసినోరు-" అన్నాడు అప్పన్న —

సభలో గుసగుసలు బయలుదేరాయి. రాము నాయుడికిది యిష్టంలేదు. రామునాయుడు వాళ్లందరికీ నాయకుడు. అతని కదే గర్వం. అప్పన్నంటే వాడికి మహా కోపం. ఈర్ష్య - కారణం అప్పన్న డబ్బున్నవాడు. డబ్బుతో వాడికి పలుకుబడికూడా రావచ్చునను. అప్పుడే తన విలువ తగ్గిపోతూందేమో నని అతనికే అనుమానంగా వుంది. అప్పన్నని విచ్చలవిడిగా వొదిలేస్తే ఇంకేముంది. మరోనాలుగు రోజులు పోతే వాడిముందు తను దిగదుడుపు అవుతాడు.

"చాల్లేరా, నువ్విచ్చినావు మే ముచ్చుకున్నాము-" అన్నాడు మీసాలు మెలివేస్తూ. కాని కొంతమందికి అప్పన్న సలహా సబబుగానే వుందనిపించింది. కష్టమొచ్చినసమయంలో సాయంచెయ్యడానికొచ్చేడు. ఈ సమయంలో యింకొకడైతే వీళ్లందరినీ ఏడిపిస్తాడు.

"అప్పన్న సెప్పింది సబువుగానే వుందేస్. ఎల్లకాలం యిరోదమేటి? పొన్నూరో దెవడేనా సూత్తే మొగంమీద దూసేత్తాడు,"అన్నాడు చాకలి సత్తిగాడు. సత్తిగాడిని కొంతమంది బలపరిచారు. అప్పన్న మంచివాడు, వాడెవరికీ అపకారం చెయ్యలేదన్నారుకూడా కొందరు; "బాగుందేస్, అప్పన్న సెప్పిందే సత్తెం - నేకపోతే ఆడు వూర్లోపుట్టి పెరిగినాడు, ఆడి[illegible]టి యిరోదమేటి, మూరకత్వం —" అన్నాడు గొల్ల వెంకడు. గొల్ల వెంకడు యీ మాటనడం కొందరికి ఆశ్చర్యమేసింది. వాడు రెండో నాయకుడు - ఇంకేముంది అంతా దారిలోకొచ్చేరన్నమాట. అప్పన్నకి ధైర్యమొచ్చింది. ఫలించింది తన పథకం. కాని కొంతమంది వొప్పుకోలేదు - వాడి దగ్గరయీరోజు నాలుగు కమ్మరేకులుపుచ్చుకుంటే మరీ అలుసయిపోతామన్నారు కొంతమంది. రామునాయుడి యిష్టంలేదు అప్పన్నతో రాజీచేసుకోవడం - కాని గొల్ల వెంకడు మాత్రం అప్పన్న సహాయం తోసిపుచ్చకూడ దన్నాడు - అంటే నాయకత్వం చీలిపోయింది. కాని ఎవరూ వొక నిర్ధారణకూ, నిర్ణయానికీ రాలేకపోయారు - రామునాయుడు వయసులోనూ, జాతిలోనూ, పలుకుబడిలోనూ, పెద్దవాడు - నిరాటంకంగా నాయకత్వం నిర్వహించినవాడు - ఛటుక్కున లేచి, కోపంగా కర్ర నేలకు కొట్టేడు; మీసాలు మెలివేసి గుడ్లెర్రజేసేడు. కూర్చున్నవాళ్లంతా వాడివేపే చూస్తున్నారు - అందరినీ తనవేపుకి మెల్లిగా లాక్కున్నాడు. చివరినిర్ణయం తనచేతిలోకి వచ్చింది - వీటో ప్రయోగించేడు —

"ఓ రెల్లంట్రా- మా గనమైన దర్మరాజు బయలుదేరినాడు - నెగండ్రా." అని గబాలున లేచి, తుబుక్కున వుమ్మి బయలుదేరేడు - అంతా పోలోమని లేచారు. పకపక నవ్వుకుంటూ నాయుడివెనకాతల వెళ్లిపోయారు.

అప్పన్న కేమీ తోచలేదు. ఏ అర్థం కాలేదు. ఇంటికొచ్చి వీధిలో నులకమంచంమీద కాళ్లు చాచుకుని పడుకున్నాడు - ఎదురుగుండా మసిబారిన మొండిగోడలు నవ్వుతున్నట్లు కనిపించేయి!